


# వారధి

- మంచీ - చెడూ

- పుణ్యం - పాపం

- ఇలాంటివాటికి వెలుగు చీకట్లని సంకేతాలుగా వాడుతూ వుంటారు. అయితే వెలుగున్న చోటల్లా మంచి జరుగుతోందా? చీకట్లో అంతా చెడేనా?

ఇలా ఆలోచిస్తూ పొలంనుంచి నడిచొస్తున్నాడు గోపాలం.
రాత్రయింది. చీకట్లో దారి సరిగా కన్పించటం లేదు.
మళ్ళీ అదే ఆలోచనతో వూరివైపు చూశాడు.
ఊరిపైన వెలుగు పూలు గుప్పున పూచేయి.
- అదిగో అక్కడంతా వెలుగు.
ఎడం పక్క పేట వైపు చూశాడు
అక్కడవాళ్ళ బతుకుల్లాగే అంతా చీకటి!

– అక్కడ ఆ వెలుగు సత్కార్యాలకి సంకేతమా ? ఉహుం కాదు. అక్కడ జరిగేవన్నీ దుష్కార్యాలే !!

– మరిక్కడ ? ఆ రెంటికీ భేదం తెలీని అమాయకులు. పాపం పడగ నీడలో బతుకుతోన్న కప్పలు.

వేణుగోపాలస్వామి ఆలయం దగ్గరయింది. చిరుగాలికి గోపురం మీది గంటలు లలితంగా, లలిత మధురంగా మంద్రస్వరం చేస్తున్నాయి.

ఆతనికి పెట్టిన పేరు ఆ దేవుడిదే అయినా అతనికి దేవుడిమీద అట్టే నమ్మకంలేదు. కాని దేవుడి పేరుమీద నడిచే రాజకీయాంమీద అతనికి గట్టి నమ్మకం వుంది. అందుకే గుడి రాజకీయాల్లో గుట్టుగా తలదూర్చి అప్పుడప్పుడూ వాటి ఆట కట్టిస్తూ వుంటాడు.

పుంత దగ్గరి కొచ్చేడు. ఊరి మురికంతా అందులోకే పారుతుంది. వర్షాకాలం తప్ప అందులోని నీరు కదిల్నట్టు అనిపించదు. అందుకే నాచు, ఇతర నీటి మొక్కలతోటి నీరు నల్లగా వుంటుంది. అయినా పేటలోని పిల్లలంతా అందులోనే ఈతలు కొడతారు. చేపలు పడతారు.

గత యేడాది పుంత వేలం వేయించాలని పంచాయితీలో ప్రతిపాదన పెట్టించేడు కరణం. అది పంచాయితీకి ఆదాయమే. అయినా పేదవాళ్లు బ్రతుకుతున్నారని తను పడనివ్వలేదు.

పుంత దిగాలి. దిగితేతప్ప అవతల ఊరివైపుకు వెళ్ళలేదు.

అక్కడ వంతెన కట్టాలని ఎప్పట్నుంచో పోరాడుతున్నారు. పడనిస్తేనా ఊరి నేతలు ? అమెరికా ప్రెసిడెంటులా తనకీ వీటోహక్కులాంటిది వుంటే ఎంత బావుణ్ను !

నీటిలో దిగటానికి పేపరు మడిచి, చంకలో పైజమా రెండు చేతుల్తో లాగి పైకి పట్టుకున్నాడు.

పొరుగూరు పనుల కెళ్ళిన వాళ్ళెవరో పాడుకుంటో మాటలు చెప్పుకుంటో పేటవైపు నడిచి పోతున్నారు. వాళ్ళని చూస్తే ఆనందమూ దిగులూ కలుగుతూ వుంటాయి గోపాలానికి. ఎంత కష్టం చేసినా వాళ్ళలో వుత్సాహం చావదు. ఎంతకష్టం చేసినా పొట్ట ఒక్కనాడూ నిండదు.

పుంతదాటి అవతలికెళ్ళేడు గోపాలం. గుడి గోపురం మీది మెర్క్యురీ దీపం వెలుగు ఎత్తు గోడమీద పడి చీకటిని మరింత చిక్కబరిచింది. దారి కన్పించక అడుగులో అడుగు వేసుకుంటూ నడిచి గుడి సింహద్వారం దగ్గిర ఆగేడు.

లోపల లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. గుడికి దీపాలొచ్చి రెండ్రోజులే అయింది.

•విద్యుద్దీపాలొచ్చేక, వెధవది ఎంత దేవుడైతే మాత్రం నూనె దీపాలమీద అభిరుచి ఏం ఉంటుంది? అయినా తప్పదు. సాంప్రదాయం మరి! అంధయుగంలో బతికి, నూనెయుగంలో బట్టకట్టిన భగవంతుడికి అణుయుగంలోకూడా యీ బెడద తప్పలేదు. ఆయనకీ యీ సాంప్రదాయాలమీద మహ చెడ్డ కోపం వుండి వుంటుంది. ఉండదూ మరి! తనుచేసిన మనుషులు అలా ఎలక్ట్రిక్ దీపాల్లో సుఖపడ్డమేమిటి, తను యిలా నూనె దీపాలముందు జిడ్డు ఓడుతూ జీవించటమేమిటి, కాని ఏంచేస్తాడు? చెప్పుకోను నోరు లేదాయె!

పూజారి అర్చన ముగించినట్టున్నాడు. దీపాలు మందంగా వెలుగుతున్నాయి (లేక విద్యుద్దీపాలమధ్య అలా అన్పిస్తుందో) ఫలహారం సుష్టుగా పట్టించినట్టున్నాడు. కాయాన్ని బరువుగా స్థంభానికి చేరవేశాడు.

'పంతులుగారూ' పిల్చేడు గోపాలం.

కంఠం పోల్చుకున్నాక—

'ఎవరూ, ప్రెసిడెంటుగారా! ఆగండి బాబూ వస్తున్నాను.,

లేచే ప్రయత్నంలో ఆయాసాన్ని 'శివశివా' అంటూ శివధ్యానంతో సాయం పట్టేసి ద్వారం దగ్గరికొచ్చేడు. తలుపు తీసి—

'రండి' అని ఆహ్వానించాడు.

లోపలికి అడుగుపెట్టి గేటు అతనే మూసి

'సరేగాని పంతులుగారూ వైష్ణవాలయం అర్చకుడిగా వుండి ఆ వ్యాఖ్యానం ఏమిటండీ' అనడిగేడు గోపాలం నవ్వుతూనే.

పూజారి నాలిక్కరుచుకున్నాడు.

'ఏదో అలవాటు బాబూ, ఎంత చెడ్డా వీరశైవుణ్ని కదా.'

'అవును పాపం! భక్తి ఒక చోటా భజన మరో చోటా అయిపోయింది మీకు.'

'ఏం చేస్తాన్నాయనా పొట్టకోసం యీ పాట్లన్నీ. ఈ బుడ్డ వెధవని పెంచుకునే వ్యాపకం ఏదైనా కాస్త చూపించవయ్యా అంటే ఇదుగో ఇక్కడ పారేశాడు మీ కరణం'

'మా కరణం అంటారేవిటండీ, మీ బావగారేగా!'

ఆ బుడ్డవెధవ అక్కడ ట్యూబులైటు కింద పుస్తకం వేసుకూర్చొన్నాడు. చదువుకొంటున్నాడో లేక వాళ్ళ సంభాషణ వినీవిననట్టు గుట్టుగా వింటున్నాడో తెలీదు. తల మాత్రం పుస్తకం మీటి నించి ఒక్క క్షణమైనా ఎత్తిన జాడలేదు.

బయటినుంచి పిలుపు వినిపించింది.

'బాబో .. అయ్యగారో ... ఒక్కసారి తలుపు తియ్యి, దండం పెట్టుకు పోతాం.'

సింహద్వారం దగ్గిర ఫ్లోరెసెంట్ దీపం కింద నల్లటి పొడుగాటి ఆకారం ఒకటి నిలబడి వుంటి. పక్కన ఓ కుర్రాడు! చూడ్డానికి తెలుపు చర్మంవే గాని ఎండలో తిరగటంవల్లనో మరెందుకో తెలుపుకీ, నలుపుకీ చెందని మరేదో రంగులో వున్నాడు.

'వెళ్ళి చూసిరండి. ఏదో అంటున్నాడు.'

'ఏమంటున్నాడో విన్పించటంలా. దండం పెట్టుకుంటాడట! తలుపు తియ్యమంటున్నాడు.'

'తియ్యండి మరి!'

'పరాచకమా యేమిటి గోపాలం బాబూ! యీ అప్రాచ్యులు ఎప్పుడైనా లోపలికి రావటం చూశారా మీరు?'

'లేదు. ఇప్పుడు చూద్దామని ...'

'వీల్లేదు' అని వాళ్ళవైపు చూసి 'తలుపు తియ్యటానికి వీలుగాదు. అక్కణ్ణుంచే దణ్ణం పెట్టుకు వెళ్ళండి' అన్నాడు.

'అదేంవిటండీ, అసలు ఆలయం వాళ్ళదేగా?'

'బాగానేవుంటి మీ పరిహాసం'

'ఇలా చూడండి. యీ పేపర్లో తాటికాయలంతటి అక్షరాల్లో ఎలా రాసేరో!'

ఆరోజు పేపరువిప్పి చూపించేడు.

—హరిజనవాడ విద్యుదీకరణ....

'చదివేరా విషయం అంతా?'

'ఆ.... చదివేను.'

'మరేఁవంటారు? ఆ రోజున మంత్రిగారు స్విచాన్‌చేసి దీపాలు వెలిగించింది ఇక్కడే గదండీ!'

'ఏమో నాయనా మీ రాజకీయాలూ మీరూను'

'ఇందులో రాజకీయం ఏఁవుందండీ? హరిజనులని వాళ్ళకో ముద్దుపేరు పెట్టేరుగా. దేవుడికి దీపాలుంటే బిడ్డలకున్నట్లే మరి!'

పంతులుగారు మాట్లాళ్ళేదు.

'ఏమంటారు? రానియ్యండి వాళ్ళని. ఆలయానికి దగ్గరా దేవుడికి దూరమూనా....'

'లాభం లేదంటే మీరు జైలుకి, వాళ్ళు లోపలికే.... తప్పదు మరి!'

పూజారికి ఒణుకూ దడా పట్టుకుంది. ఫూరికి ప్రెసిడెంటు. ఏం చేయటానికైనా సమర్థుడే మరి!

'తగలడండి దేబె మొఖాలు. దైవ దర్శనానికి అంత అర్జంటు ఏం ఒచ్చిందో!'

'మా దాఁవుడికి రేపట్నుంచీ పరీచ్చలంట బాబూ' అంటూనే లోపలికి అడుగుపెట్టేడు వెంకన్న.

* * *

కచేరీ చావిడి దగ్గర ఊరి ప్రముఖులంతా హాజరయ్యేరు. ఒక పక్క ఫూరి పెద్దలు కాలుమీద కాలేసుకూర్చున్నారు. మరోపక్క పేటలోని పేద జనం బొంతెన కాళ్ళమీద ఒరిగి కూర్చున్నారు.

కరణంగారు ఇంకా సభకి వేంచేయలేదు. ఆయన రాక కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

గంట గడిచేక 'రాజు వెడలె సభకూ...' అన్నట్టు దయచేశారు కరణంగారు. రాగానే—

'ఏరా వెంకా నీ కొడుకు గుళ్ళో కెందుకెళ్ళేడు' అని అడిగేడు.

'ఎందు కెళ్ళాడనేటిగాదు మొదటి ప్రశ్న ఎలా వెళ్లాడనేటి' అందించేడు మరో ప్రబుద్ధుడు.

వెంకన్న వులకలేదు పలకలేదు. మోకాళ్ళలో తల పెట్టుకుని భోరున ఏడుస్తున్నాడు.

'మేమేం పనుల్లేక ఇక్కడ కూర్చోలేదు. త్వరగా తెమల్చాలి' గద్దించేడో పెద్దమనిషి.

'సెప్పరా యెంకన్నా. దొరలకి యేదోటి సెప్పుకోవాలిగా. నువు యేడుత్తా గూకుంటె సచ్చినోడు లేసొత్తాడేంటి. పాపం తల్లి సచ్చినా తల్లిలాగే గారంగా పెంచుకున్నావు. ఉన్న ఒక్క టిక్కూ యెల్లి పోయింది. ఏం చేద్దాం...' అంటూ ఓదార్చాడు తోటివాడు.

'వాడి కొడుకు చచ్చి వాడేడుస్తుంటే యేమిటి చెప్పేది?' అందుకున్నాడు గోపాలం.

'ఏమీ చెప్పకపోతే ఇక్కడ ఎందుకు కూర్చున్నట్టు?' కరణం గారి ప్రశ్న.

'అది మీకే తెలియాలి'

'ప్రెసిడెంటుగారు తమరే సెలవియ్యండి మరి?' అన్నాడు వెటకారంగా.

'ఇది పంచాయతీ మీటింగు కాదు'

'అయితే నీ ప్రమేయం ఏఁవీ లేదిక్కడ. ఊఁ చెప్పరా ఎలా వెళ్ళేడు ?' అడిగేడు వెంకన్నని.

'అతను చెప్పేముందు అసలు మీరేం అనుకుంటున్నారో విన వచ్చా ?'

'తెలీటంలా. లోపల స్వామివారి కిరీటంవుంది. వేణువుంది. అది కాజెయ్యటానికే పంపించి వుంటాడు.'

'బాబో, కరణం బాబో.... అంత దారుణంగా మాటాడకండి బాబో.... కన్నం మా యింటావొంటా లేదు.'

'నువ్వూరుకో వెంకన్నా !' అని మళ్ళీ కరణం వైపు తిరిగి 'నేరం మీరే మోపి వుంచేరు. అతను అవునన్నా, కాదన్నా మీ తల కెక్కదు. అసలు వాడు చావనే చచ్చేడు. ఇంతకీ మీరు చేయదల్చు కున్నదేమిటి ?'

'ఏం చేయాలో మాకు తెల్సు. ముందు వాడినించి సమాధానం రావాలి'

'అవును. చెప్పాలి.' అందరూ ఒత్తిడి చేసేరు.

వెంకన్న లేచి నుంచునీ దుఃఖం బిగమింగుకుంటో—

'నానేం సెప్పినా సెల్లదు.... పేదోడి మాట పెటివికి సేటు. నా కొడుకు పంతులుగారి అబ్బాయి దగ్గర యెలట్రీ లైటులో పదువుకుంటా నని అడిగాడు. ఆ బాబు రమ్మంటన్నాడని సెప్పాడు. ఓరెదవా మనం అక్కడికి యెల్లకూడదురా అన్నాను. ఆ మన్నాడు పూజారిగారబ్బాయి టూబు ఇస్తానన్నాడు. తెచ్చుకుంటానే అన్నాడు. అదేంటో నాకు తెల వలేదు, ఊరుకున్నాను. అరేత్రి నా బిడ్డ యింటికి రాలేదు. పూరంతా యెతికాను. కడకి సావు కబురు యిన్నాను...'

'చూశారా తిరిగి ఎక్కడికి పెట్టేదో.... ఎంతకైనా సమర్థులు వీళ్లు.'

'సమర్థులు వాళ్లు గారు. మనం! కలిసొస్తుంటే దేవుణ్ని కూడా మోసం చెయ్యగలం. శైవుణ్ని తెచ్చి వైష్ణవాలయంలో సైతం అర్చకుడిగా నియమించగలం....'

కరణం కంగుతిన్నాడు.

'అలా ఎన్నడూ జరగలేదు.'

'అవును. అలా ఎన్నడూ, ఎక్కడా జరగలేదు. ఇక్కడే.'

'అసలు సమస్యను దాటేయటానికి ఇదంతాను.'

'ఇదే అసలు సమస్య. ఇది తేల్చండి ముందు. ఆయన మీ చుట్టం గనక శైవుడయినా అర్చకుడుగా పెట్టి దేవుడి ఆస్తంతా అప్పగించేరు. ఆయన శివస్మరణ తప్ప మరో మాట మాట్లాడడు. ఇదేవంటారు?'

'ఇది అప్రస్తుత ప్రసంగం. ప్రస్తుత విషయం ఇదికాదు.' అని కాస్సేపాగి ఉపన్యాసం ప్రారంభించేడు.

'నేనేం చేసినా, ఏం మాట్లాడినా ఊరి బాగోగులు దృష్టిలో పెట్టుకునే చేస్తాను. అప్పుడు వంతెన ఎందుకు ఒద్దన్నానో ఇప్పుడు అందరికీ అర్థమై వుంటుంది. ఇవాళ దేవుడి గుడి అయింది. రేపు మన యిల్లు. కాదనేదేముంది? గోటితో పోయేది గొడ్డలి దాకా ఎందుకు? ఏదో వూరికోసం నోరు పారేసుకుంటూ వుంటాను. మీరంతా కాదంటే నోరుమూసుక్కూర్చుంటాను.'

'అబ్బే..., అలాగనకండి కరణంగారూ...'

'మరేవిటి.... నిన్నగాక మొన్న పుట్టిన కుర్రకుంక ప్రెసి

డెంటయినంతమాత్రాన వయసుకు విలువలేకుండా మాట్లాడమేనా.... ఇందులో ఎంతమంది పెద్దల్లేరు. ..'

'అతని మాట మాకక్కర్లేదు....ఏంచేద్దామో మీరే తేల్చండి..'

'ఊరు క్షేమంగా వుండాలంటే పేటను అక్కడ్నుంచి తరలించి వెయ్యాలి.'

*　　*　　*

విశ్వాసరాహిత్య తీర్మానంలో గోపాలం పదవినుంచి దిగిపోయాడు. ప్రస్తుతం అతనికి పేట సమస్యలే పరమావధి. అందర్నీ సంఘటిత పర్చటానికి నిద్రాహారాలు మాని కృషి చేసాడు.

ఊరికవతల వల్లకాటికి దగ్గరగా పనికిరాని ప్రభుత్వ భూముల్లో హరిజనులకు ఇళ్లు కట్టాలని ప్రభుత్వం తలపెట్టింది. ఆ కాంట్రాక్టు కూడా కరణంగారే చేపట్టి అతి శీఘ్రంగా గృహనిర్మాణం చేశారు.

'ఈ భూమ్మీద మీకు హక్కు ఏర్పడుతుంది. మీ తాతల్నాటి నుంచి ఇక్కడే వుంటున్నారు. ఇక్కడ్నించి కదలకండి' అని హరిజనులకి ఉద్బోధించేడు గోపాలం.

కాని—

ఇక్కడున్నవి గుడిసెలే.

అక్కడ కన్పించేవి మేడల్లాంటి గుడిసెలు.

ఒక్కొక్కరూ ఇక్కడిస్థలాలు విడిచి అక్కడికి చేరుకున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశాడని భద్రతా చట్టంక్రింద గోపాలాన్ని అదుపులోకి తీసుకున్నారు.

వాళ్ళు ఖాళీచేసిన స్థలం కరణంగారిదేనని ఎంతమందికి తెల్సు?